క్లుప్తంగా

బక్రీదును ప్రశాంతంగా జరుపుకోండి

ఆళ్లగడ్డ: బక్రీద్ పండుగను ప్రశాంత వాతవరణం, చట్టానికి లోబడి జరుపుకోవాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం అన్ని మతాల పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన పండుగను ఎవరికి ఇబ్బంది కలిగించకుండా సంతోషంగా జరుపుకోవాలని చెప్పారు.

శిరివెళ్ల: బక్రీదు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ చంద్రబాబునాయుడు సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లింలు మత సామరస్యం పాటించి సోదర భావంతో మెలగాలన్నారు. పండుగ సందర్భంగా ఈద్గాలు, మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మత పెద్దలు సహకరించాలని కోరారు.ఎస్ఐ సురేష్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు,ఎంపీటీసీశ్రీనివాసులు పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు

శిరివెళ్ల: మండలంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం పనులకు బిల్లులు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. మహదేవపురంలో వేసిన సిమెంట్ రోడ్డుకు రూ.10 లక్షలు, గంగవరం రూ. 17 లక్షలు, జీనేపల్లెలో వేసిన సిమెంట్ రోడ్డు పనులకు రూ.5లక్షలు మంజూరయ్యాయని చెప్పారు.

సీట్లు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): కస్తూర్బా, ఏపీ మోడల్ స్కూళ్లల్లో సీట్ల సంఖ్య పెంచాలని ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ కోరారు. శనివారం ఈ మేరకు డీఈఓ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఆయన మాట్లాడుతూ సీట్లు పెంచడం ద్వారా మరింత మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు.

27న జిల్లా చెస్ జట్టు ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే నంద్యాల జిల్లా ఓపెన్ చెస్, మహిళా జట్ల ఎంపిక పోటీలు నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న వివేకానంద ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9010451585 నంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో బర్రె మృతి

గోస్పాడు: ఒంటివెలగల గ్రామం లో విద్యుత్ షాక్‌తో రామతులసమ్మకు చెందిన బర్రె మృతి చెందింది. శనివారం మేపేందుకు బర్రెలను పొలాలకు తోలుకెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తెగిపడి ఉన్న వైపు బర్రెలు మేయడానికి వెళ్లాయి. దీంతో ఓ బర్రె విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

ఈ–కేవైసీ చేయించుకోండి

రుద్రవరం: పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందేందుకు రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు. మండలంలోని ఎల్లావత్తుల, కోటకొండ గ్రామాల్లోని ఆర్‌బీకేలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1,958 మంది రైతులు పీఎం కిసాన్‌కు సంబంధించి ఈ–కేవైసీ చేయించుకోలేదన్నారు. బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు పడనివారికి, మొబైల్ ఓటీపీ రాని వారికి మొబైల్ ఫేస్ అథంటికేషన్ ద్వారా చేస్తారని, అలాంటి వారు ఆర్‌బీకేలకు వెళ్లి చేయించుకోవాలని సూచించారు.

వంద శాతం సబ్సిడీపై పండ్ల మొక్కలు



జామ పంటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

చాగలమర్రి: ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద వంద శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలు రైతులకు అందజేస్తుందని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని డి.వనిపెంట మజరా గ్రామమైన చెంచుగూడెంను సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వంద శాతం సబ్సిడీతో 17 రకాల ఉద్యాన పంటలకు సంబంధించిన మొక్కలు అందిస్తామని, సొంత భూములున్న గిరిజన రైతులు పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు స్పందిస్తూ.. మామిడి తోటలు సాగు చేస్తున్నామని, తాము 65 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేయాలనుకుంటున్నామని, మొక్కలు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటి వరకు పండ్ల తోటల సాగుకు మండలంలో 170 ఎకరాలను మాత్రమే గుర్తించారని చెప్పారు.అనంతరం సిబ్బందితో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హార్టికల్చర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఏపీఓ నిర్మల ఉన్నారు.

విద్యా విధానంపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): జాతీయ విద్యావిధానం–2020 అనుసరించి రాయలసీమ విశ్వవిద్యాలయం, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన నాలుగు సంవత్సరాల డిగ్రీ సింగిల్ మేజర్ విధానంపై నంద్యాల డిగ్రీ కళాశాలలో శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరానంద పుచ్చ మాట్లాడుతూ నూతన విద్యావిధానం విద్యార్థికి ఎలా మేలు చేకూరుస్తుందో వివరించారు. నంద్యాల, బనగానపల్లె, అవుకు, ఆత్మకూరు కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి అండగా 'జగనన్న సురక్ష'

- నియోజకవర్గంలో ప్రారంభమైన ఇంటింటి సర్వే
- సంక్షేమ పథకాలు, సమస్యలపై ఆరా
- అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం
- అవసరమైన ధ్రువ పత్రాలు అందజేసి మరీ సంక్షేమ పథకాలు మంజూరు
- అర్హత ఉండి లబ్ధి పొందని పేదలకు అద్భుత అవకాశం



మిట్టపల్లెలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఆళ్లగడ్డ: అర్హత ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలకు ఏ ఒక్కరూ దూరం కాకూడదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు నియోజకవర్గ యంత్రాంగం స్థానిక ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. నాలుగేళ్ల జగనన్న పాలనలో వివిధ పథకాల ద్వారా నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ.1307.32 కోట్ల వరకు ప్రభుత్వం అందజేసింది.

ఈ నెల 30వరకు సర్వే.. జూలై 1 నుంచి క్యాంపులు అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం అవసరమైన సర్టిఫికెట్లు, ఇతర డాక్యుమెంట్లు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 30వ తేదీ వరకు అధికారులు, వలంటీర్లు, గృహ సారథులు ఆరు మండలాల్లోని ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. జూలై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు క్యాంపులు ఏర్పాటు చేసి ధ్రువ పత్రాలు అందజేసి సంక్షేమ పథకాలకు అర్హత పొందేలా చర్యలు తీసుకుంటారు.

మండలాల వారీగా నాలుగేళ్లలో సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ఖాతాల్లో జమ అయిన మొత్తం

మండలం	గ్రామ పంచాయతీలు	సచివాలయాలు	నివాస గృహాలు	లబ్ధిదారులు	మొత్తం (రూ.ల్లో)
రుద్రవరం	21	16	13,758	56,942	765982085
శిరివెళ్ల	16	16	16,963	53,331	7028972534
చాగలమర్రి	19	17	13,990	55,427	2150943493
దొర్నిపాడు	11	09	6,965	50,175	1171050204
ఆళ్లగడ్డ	17	12	9,186	38,038	470931068
ఆళ్లగడ్డ టౌన్	--	10	14,139	44,521	1386004086
ఉయ్యాలవాడ	20	11	7,532	50,175	171050204
మొత్తం	104	91	82,533	3,00,573	13070324062

సర్వీసు చార్జీలు లేకుండా అందించే సేవలివే..

- ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువ పత్రాలు)
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- జనన, మరణ సర్టిఫికెట్
- మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్ (భూ కొనుగోలు అనంతరం ఆన్‌లైన్ నమోదు)
- వివాహ ధ్రువ పత్రం (పట్టణ ప్రాంతాల్లో 90 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 60 రోజుల్లోపు)
- ప్యామిలీ మెంబర్ సర్టిఫికెట్
- కౌలు గుర్తింపు కార్డులు
- కొత్త రేషన్ కార్డు, రేషన్‌కార్డు విభజన
- ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొందరి సభ్యుల పేర్ల తొలగింపు

ఇంటింటికీ తిరుగుతున్నాం



అర్హులైన వారికి కచ్చితంగా పథకాలు అందాలనే ఉద్దేశంతో వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తిస్తున్నాం. అలాగే వారికి ఏఏ ధ్రువ పత్రాలు అవసరమో తెలుసుకుంటున్నాం.

– విశ్వనాథరెడ్డి, వార్డు సచివాలయ కో – ఆర్డినేటర్, ఓబులంపల్లి

వివరాలు సేకరిస్తున్నాం



ప్రతి ఇంటికి తిరిగి అర్హత ఉండి ఎందుకు పథకం అందలేదో వివరాలు సేకరిస్తున్నాం. వారి నుంచి దరఖాస్తు తీసుకుని మండల స్థాయి అధికారులకు పంపుతున్నాం. అర్హత ఉన్న ఏ ఒక్కరు మాకు పథకం రాలేదు అనకుండా చర్యలు తీసుకుంటున్నాం

– అరుణ,వార్డు సచివాలయ కో – ఆర్డినేటర్, నల్లగట్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అర్హులందకిరీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశాం. ఈ అవకాశాన్ని అర్హులు వినియోగించుకోవాలి

– మహబూబ్ ఖాన్,ఎంపీడీఓ

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: దేవాలయాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వరలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,043 శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల నిర్వహణకు ధూప, దీప నైవేద్యాల కింద నెలకు రూ. 5వేలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా స్థానిక ఆలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మన సంఘం నాయకులు పాల్గొన్నారు

30న బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 30 నుంచి జూలై 1వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వంశీధర్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 30న నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో నంద్యాలలో అండర్–11, 13 విభాగాల్లో 15సంవత్సరాల్లోపు బా ల బాలికలు,జూలై 1న అండర్–17 వారికి, జూలై 2వ వారంలో పురుషుల, మహిళా విభాగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఈనెల 28వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్:8985809434 నంబరును సంప్రదించాలన్నారు.

పేద విద్యార్థుల బాధ్యత జగనన్నదే



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(న్యూటౌన్): పేద విద్యార్థుల బాధ్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చూసుకుంటున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కేవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆల్ మైనార్టీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల డివిజన్ పరిధిలోని ఉర్దూ మీడియంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, చైర్‌పర్సన్ మాబున్నిసాతో కలిసి ప్రశంసా పత్రాలు, డిక్షనరీలు అందజేసి సన్మానించారు. అలాగే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన ఉపాధ్యాయులకు ప్రోత్సాహం అందించిన విద్యార్థులు తల్లిదండ్రులను కూడా సన్మానించారు. వారు మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఆర్‌డీటీ సహకారంతో రూ.3.50 కోట్లతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నూతన తరగతి గదుల నిర్మాణం, ఏపీ మోడల్ నిర్మాణ పనులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆడిటోరియం, ఉర్దూ కళాశాలకు స్థల సేకరణ, నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభం, ఐటీఐ కళాశాల ఏర్పాటు తదితర చర్యలు చేపట్టామన్నారు. ఉర్దూ కళాశాలలో అధ్యాపకుల నియామకానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిల్ అబ్దుల్‌మజీద్, కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, సిద్ధం శివరాం, హెచ్‌ఎం అసదుల్లా హుసేన్, ఆల్ మేవా ప్రతినిధులు అబులైజ్, ఇమ్రాన్‌పాషా, మాలిక్ బేగ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధి పొందిన పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం చాగలమర్రిలోని 3,4 సచివాలయాల పరిధిలోని శివాలయం వీధి, పాత ఎస్సీ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎవరైనా అర్హులై ఉండి పథకాలు వర్తించకపోయి ఉంటే జగనన్న సురక్ష ద్వారా అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనారిటి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు జె.ఇబ్రహీం, గణేష్ రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా రఫి, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, రఫీ, ఎంపీటీసీ ఎం.ఫయాజ్, సర్పంచ్ బంగారు షరీఫ్, మాజీ సర్పంచ్ రమణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకు



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం మూడవరోజు మండలంలోని జిల్లెల్లలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేసి లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా ప్రజలు లబ్ధి పొందడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ ఓబులమ్మ, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ శేఖర్, డీటీ రామచంద్రరావు పాల్గొన్నారు.

విద్యా బోధనను బాధ్యతగా తీసుకోవాలి



బదిలీ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు బాధ్యతగా విద్యాబోధన చేయాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని చాకరాజువేములలో ఎంపీపీ(స్పెషల్) ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నోట్ పుస్తకాల కోసం దాతల నుంచి రూ.30వేలు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సుదర్శన భగవాన్ అనే ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్తుండటంతో ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు అబ్దుల్ కరీం, రామచంద్రయ్య, హెచ్‌ఎం అమరేశ్వరప్ప, జెడ్పీటీసీ శకుంతల, సింగిల్‌విండో ప్రెసిడెంట్ భూమా చెంచిరెడ్డి, స్థానికులు చలమయ్య, మోహన్‌నాయుడు, ఉపాధ్యాయులు రామకృష్ణ, విజయలక్ష్మి, రామకృష్ణారెడ్డి, తేజేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు అవగాహన

రుద్రవరం: విద్యుత్ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆ శాఖ మండల ఏఈ రాఘవేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లావత్తుల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శనివారం విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గాలి, వానల వల్ల విద్యుత్ తీగలు తెగినా,స్తంభాలు నేల కూలినా వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే మరమ్మతులు చేయిస్తామన్నారు. సర్పంచులు దేగాని వెంకటేష్,చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేటు హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ కోరారు. శనివారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రైవేటు హాస్టళ్లను అనుమతి లేకుండా ఇష్టమొచ్చినట్లు నడుపుకుంటున్నారన్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ ప్రవీణ్‌కుమార్

బొమ్మలసత్రం: విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని సెబ్ సీఐ ప్రవీణ్ కుమార్ నాయక్ సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నా లేదా సరఫరా చేస్తున్నా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమాచారమిచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. వాటి వినియోగం వల్ల చిన్న వయస్సులోనే అనారోగ్యం పాలవుతారన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలకు వరం పీఎంఏవై

ఆళ్లగడ్డ: ఇళ్లులేని గ్రామీణ పేదలకు ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన పథకం వరం లాంటిదని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అన్నారు. పీఎంఏవై సంబరాల్లో భాగంగా మిట్టపల్లె గ్రామంలో పథకం కింద నిర్మించిన ఇంటి వద్ద శనివారం లబ్ధిదారులతో సంబరాలు నిర్వహించారు. హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, పీఆర్ ఏఈ కమాల్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు ఉన్నారు.

విధుల్లో చేరిన వీఆర్ఓ, సర్వేయర్

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం వీఆర్ఓగా రాధమ్మ, బుర్రారెడ్డిపల్లె గ్రామ సర్వేయర్‌గా శ్రావణి శనివారం తహసీల్దార్ జయప్రసాద్ సమక్షంలో విధుల్లో చేరారు. వృత్తిపట్ల బాధ్యతగా ఉండాలని రైతులు, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. రెండు గ్రామాల్లో వీఆర్ఓ, సర్వేయర్ లేక ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

నంద్యాల(న్యూటౌన్): మహిళలు వివిధ జీవనోపాధులు చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. జిల్లా లైన్ డిపార్టుమెంట్ అధికారులు, పర్సన్స్ హాజరై అన్ని అంశాల మీద సమీక్ష నిర్వహించారు. సమావేశంలో 27 మండలాల మహిళా సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

చాగలమర్రి: ఫ్యాప్టో కార్యచరణను విజయవంతం చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు శివశంకర్, ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి సుబ్బారావు పిలుపునిచ్చారు. వారు శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద కార్యాచరణ కరపత్రాలను విడుదల చేశారు. నారాయణరెడ్డి, శేషాద్రి, మహబుబ్‌బాషా, మస్తాన్ బాషా పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

నంద్యాల(సిటీ): గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం స్థానిక 1వ వార్డు పీవీ నగర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

రుద్రవరం: గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, హౌసింగ్ ఏఈ నాగరాజు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.స్థానిక బెస్త కాలనీ వైపు ఉన్న జగనన్న లేఅవుట్‌ను శనివారం వారు పరిశీలించారు. అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ప్రవేశ పెట్టి ఎనమిదేళ్లు పూర్తయిన సందర్భంగా అధికారులు లబ్ధిదారులను చైతన్య పరిచారు.

ఉయ్యాలవాడ : జగనన్న లేఅవుట్‌లలో నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని ఆర్.పాంపల్లె, ఉయ్యాలవాడ గ్రామాల్లోని జగనన్న కాలనీలను సందర్శించారు. హౌసింగ్ ఏఈ నరసింహరావు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్‌ఏఈలు ఫణీత్‌కృష్ణ, రామకృష్ణారెడ్డి, ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

శిరివెళ్ల: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చురుకుగా జరుగుతున్నాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం స్థానిక జగనన్న కాలనీలో హౌసింగ్‌డే జరిగింది. ఆయన మాట్లాడుతూ కాలనీకి 550 గృహాలు మంజూరు కాగా 55 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 415 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో చైర్మన్ మాధవస్వామి, సెక్రటరీ సుబ్బన్న అన్నారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఫ్యాప్టో సదస్సును జయప్రదం చేయాలని, కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు రామచంద్రారెడ్డి, దస్తగిరి, గోపాలకృష్ణ, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాసులు, జాకీర్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేద్దాం

రుద్రవరం: జగనన్న సురక్ష పథ కాన్ని విజయవంతం చేసేందుకు అందరు కృషి చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి,తహసీల్దారు రవీంద్రప్రసాదు అన్నారు.స్థానిక 1,2,3 గ్రామ సచివాలయ సిబ్బంది,వలంటీర్లతో శనివారం సమావేశం నిర్వహించారు.

దొర్నిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని గుండుపాపల, క్రిష్టిపాడు సచివాలయాలయాల పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాల వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు.

నంద్యాల(సిటీ): జగనన్న సురక్షను పటిష్టంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రా రెడ్డి సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ పరిధిలోని వార్డు నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది నోడల్ అధికారుల సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు.

ఉయ్యాలవాడ : ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు గ్రామ వలంటీర్లకు సూచించారు. శనివారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు చేపట్టిన సర్వేను పరిశీలించారు.